# సాక్షి వైఎస్ఆర్ జిల్లా

శుక్రవారం । 21 । ఏప్రిల్ । 2023






**కరుణ చూపే ఘడియకోసం ఎదురుచూపు**

రంజాన్ మాసంలోని చివరి శుక్రవారం జుమ్మా ప్రార్థనల కోసం మసీదులు సిద్ధమవుతున్నాయి. -8లో




**మిషన్ వాత్సల్యతో ఆర్థిక భరోసా**

అనాథలుగా మారిన పిల్లలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న మిషన్ వాత్సల్య పథకం భరోసాగా నిలుస్తోంది. - 8లో



**వైభవం..గ్రామోత్సవం**

పుష్పగిరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి సింహ వాహనంపై, శ్రీ చెన్న కేశవ స్వామి గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. - 8లో




## న్యూస్‌రీల్

### కేజీబీవీలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో ప్రవేశాలకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం కడప సమగ్రశిక్ష కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో 36 మండలాల పరిధిలో 17 కేజీబీవీలు ఉండగా వీటిలో 2023–24 విద్యా సంవత్సరానికి 1440 సీట్లు ఉన్నాయన్నారు. ఇందులో 6వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరానికి నూతన ప్రవేశాలతోపాటు 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన వారు ఈ నెల 30వ తేదీలోపు http:// apkgbv. apcfss.in ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా సానపురెడ్డి



ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకుడు సానపురెడ్డి ప్రతాప్‌రెడ్డిని ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా నియమిస్తూ ఈనెల 17న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన రెండేళ్ల పాటు పదవిలో కొనసాగనున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆవిర్భావం నుంచి ఈయన పార్టీ కోసం పనిచేస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చాక పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.

### పెద్దదర్గాలో సినీ నటుల ప్రార్థనలు



పెద్ద దర్గాలో ప్రార్థనలకు విచ్చేసిన సినీ నటులు

కడప కల్చరల్/చెన్నూరు: సినీ యువ నటులు గురువారం కడప నగరంలోని అస్తానె మగ్దూం ఇలాహి హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా అమీన్‌పీర్ (పెద్దదర్గా)సాహెబ్ దర్గాను దర్శించుకున్నారు. సినీ దర్శకురాలు నందినిరెడ్డి, యువ నటులు సంతోష్ శోభన్, మాళవికా కుమార్‌లు ఈ సందర్భంగా దర్గాలో ప్రార్థనలు నిర్వహించారు. దర్గా దర్శన వేళలు కాకపోవడంతో వారు దర్గా ఆవరణంలోనే ప్రార్థనలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ముజావర్ అమీర్ వారికి దర్గా విశిష్టత, చరిత్ర గురించి వివరించారు. ఆ తర్వాత వారు చెన్నూరులో దర్శకురాలు నందినిరెడ్డి విలేకరులతో మాట్లాడారు. రాయలసీమలో ఎండలు అధికంగా ఉన్నాయని, అయితే తమ సినిమా వేసవిలో చల్లదనాన్ని ఇచ్చేలా ఉంటుందని తెలిపారు. ప్రేక్షకులు ఆదరించాలని ఆమె కోరారు.

### పాలిసెట్, ఏపీఆర్‌జేసీ విద్యార్థులకు శుభవార్త



సైన్సు అధికారి రూపొందించిన వెబ్‌సైట్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ రాఘవరెడ్డి

కడప ఎడ్యుకేషన్: పదవ తరగతి పూర్తి చేసుకుని పాలిసెట్, ఏపీఆర్‌జేసీకి సిద్ధమయ్యే విద్యార్థుల కోసం జిల్లా సైన్సు అధికారి మహేశ్వరరెడ్డి onlineeducationb4u అనే వెబ్‌సైట్‌ను రూపొందించారు. ఈ వెబ్‌సైట్‌లో గణితం, భౌతిక, రసాయనశాస్త్రం సబ్జెక్టులకు సంబంధించి ప్రతి సబ్జెక్టుకు 60 ప్రశ్నాపత్రాలను రూపొందించి వాటిన్నింటిని online educationb4u అనే వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. దీని ద్వారా విద్యార్థి తనకు తానుగా ల్యాప్‌టాప్, డెస్కుటాప్, మొబైల్ ఫోన్‌లలో తనకు నచ్చిన సమయంలో పరీక్ష రాయవచ్చు. పరీక్ష పూర్తి అయిన వెంటనే సబ్మిట్ చేయగా మార్కులు కనిపిస్తాయి. విద్యార్థులకు ఈ వెబ్‌సైట్ ఉపయుక్తంగా ఉండనుంది. ఈ యాప్‌ను డీఈఓ రాఘవరెడ్డి పది మూల్యాంకన కేంద్రం వద్ద ఆవిష్కరించారు.

## ఎన్‌సీసీ హబ్‌పై.. చిగురిస్తున్న ఆశలు

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో జిల్లాకు సైనిక్ స్కూల్ ఏర్పాటు, బ్రాంచ్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ బోర్డుల ఏర్పాటుకు దాదాపు రంగం సిద్ధమైంది. వైఎస్సార్ మరణంతో సైనిక్ స్కూల్ కలికిరికి తరలిపోగా.. ఆర్మీ రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు అటకెక్కింది. అయితే గత ఏడాది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జిల్లా అధికారులు, ఎన్‌సీసీ అధికారులు కలిసి ఎన్‌సీసీ హబ్‌గా మార్చేందుకు సహకారం అందించాలని కోరారు. ఈ నేపథ్యంలో ఏపీ ఎన్‌సీసీ డైరెక్టరేట్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేస్తామనడంతో జిల్లా వాసుల్లో ఆశలు చిగురించాయి.

- గతంలో త్రుటిలో అవకాశం కోల్పోయిన సైనిక్ స్కూల్, ఆర్మీ రిక్రూట్‌మెంట్ బోర్డు
- ఏపీ ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- జిల్లాలో ఏర్పాటు చేయాలని డిమాండ్



కడప నగరంలోని 30 ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలియన్

వైవీయూ: నేషనల్ కేడెట్ కార్ప్స్(ఎన్‌సీసీ)లో జిల్లాకు ప్రత్యేక చరిత్ర ఉంది. దేశవ్యాప్తంగా ఎన్‌సీసీ 1948లో అగ్జిలరీ కేడెట్ కోర్ (ఏసీసీ) పేరుతో ప్రారంభం కాగా జిల్లాలో సైతం 1957లోనే జిల్లాలో అగ్జిలరీ కేడెట్ కోర్ ప్రారంభమైంది. ప్రస్తుత ప్రభుత్వ పురుషుల కళాశాలలో (ఆర్ట్స్ కళాశాల)లో ఏర్పాటు చేశారు. అనంతరం 1964లో దీన్ని మూసివేశారు. తిరిగి 1979లో జిల్లాలో ఎన్‌సీసీ ప్రారంభమైంది. కొద్దిరోజులు ఆర్ట్స్ కళాశాలలో, తర్వాత ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఉన్న భవనాల్లో, ఆ తర్వాత పీఎఫ్ కార్యాలయం ఎదురుగా ఉన్న వీధిలో కొనసాగింది. వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎం అయిన తర్వాత కడప నగర సమీపంలోని తెలుగుగంగ కాలనీలో దాదాపు 10 ఎకరాలు యువజన సర్వీసుల శాఖకు చెందిన స్థలాన్ని బ్రాంచ్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆఫీసు ఏర్పాటుకు కేటాయించారు. దీనికి సంబంధించి లక్షలాది రూపాయలు వెచ్చించి బ్యారెక్‌లు, సిబ్బంది క్వార్టర్స్, కార్యాలయాలు నిర్మించారు. అదే సమయంలో జిల్లాకు సైనిక్ స్కూల్ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. వైఎస్సార్ ఆకస్మిక మరణంతో సైనిక్ స్కూల్ కలికిరికి తరలిపోగా, బ్రాంచ్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ కార్యాలయం ఏర్పాటు అటకెక్కింది. అయితే ఖాళీగా ఉన్న ఆ భవనాల్లో 2012లో 30 ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలియన్ ను ఏర్పాటు చేశారు.

**ఎన్‌సీసీ హబ్‌గా కడప..**



కడప నగరం ఎన్‌సీసీ నగర్‌లో 30 ఆంధ్రా బెటాలియన్ ఏర్పాటైన తర్వాత ఆ ప్రాంతమంతా చక్కగా తయారైంది. దీంతో రాయలసీమకు చెందిన ఎన్‌సీసీ క్యాంపు ఏదైనా సరే.. కడపలోనే నిర్వహించుకునేంతలా సౌకర్యాలతో తీర్చిదిద్దారు. దీంతో పాటు 2019 డిసెంబర్‌లో అప్పటి తిరుపతి గ్రూప్ కమాండర్ కల్నల్ గంగా సతీష్ కడప ఎన్‌సీసీ బెటాలియన్‌ను ఎన్‌సీసీ హబ్‌గా తీర్చిదిద్దుతామని దీనికి సంబంధించిన నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఆర్మీ రిక్రూట్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేసేందుకు అప్పటి కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ దినేష్‌కుమార్ ఝా.. జిల్లా కలెక్టర్, ఎంపీ వై.ఎస్ అవినాష్‌రెడ్డిలతో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి విన్నవించారు. కాగా ఇప్పటి వరకు ఏపీ, తెలంగాణకు ఒకటే ఎన్‌సీసీ డైరెక్టరేట్ కొనసాగుతుండగా, తాజాగా ఎన్‌సీసీ డీజీ లెఫ్టినెంట్ జనరల్ గుర్బీర్‌పాల్ సింగ్ ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేకంగా ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఏర్పాటు చేస్తామని, ఇందుకు 10 ఎకరాల స్థలం కేటాయించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డిని కలిసి వివరించారు. దీనికి స్పందించిన ముఖ్యమంత్రి తగిన చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. దీంతో జిల్లా వాసుల్లో ఆశలు మొదలయ్యాయి. అన్ని విధాలుగా సౌకర్యాలు, స్థలం కలిగి ఉన్న కడప 30 ఆంధ్రా బెటాలియన్ ప్రాంతంలో ఏపీ ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ జిల్లా వాసుల్లో మొదలైంది. దీనికి ఏపీ ఎన్‌సీసీ అధికారుల సంఘం సైతం మద్దతు ప్రకటించడం గమనార్హం.

**అన్ని విధాలుగా అనుకూల ప్రాంతం..**



ఏపీ ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఏర్పాటు చేసేందుకు కడప నగరంలోని 30 ఆంధ్రా బెటాలియన్ ప్రాంతం ఎంతో అనుకూలం. గతంలో ఇదే ప్రాంతంలో బ్రాంచ్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ కార్యాలయం ఏర్పాటు కోసం చేపట్టిన నిర్మాణాలు ఇప్పటికీ ఉన్నాయి. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవచూపి కడపలో ఏపీ ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఏర్పాటు చేసేందుకు కృషిచేయాలి. – మేజర్ సి. విజయభాస్కర్, ఆలిండియా ఎన్‌సీసీ అధికారుల సంఘం జాతీయ కార్యదర్శి, కడప

**ఏపీ ఎన్‌సీసీ డైరెక్టరేట్ కడపలో ఏర్పాటు చేయాలి**



గతంలో ఈ ప్రాంతానికి కేటాయించిన సైనిక్ స్కూల్ తరలిపోగా, ఆర్మీ రిక్రూట్‌మెంట్ బోర్డు పనులు నిలిచిపోయాయి. తాజాగా ఏపీ ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఏర్పాటు చేస్తామని ఎన్‌సీసీ ఉన్నతాధికారులు తెలపడం, ప్రభుత్వం అంగీకారం తెలపడం సంతోషకరం. వికేంద్రీకరణలో భాగంగా ఏపీ ఎన్‌సీసీ డైరెక్టరేట్‌ను కడపకు కేటాయిస్తే బాగుంటుంది. – పి.వి. సుబ్బారెడ్డి, ఏపీ ఎన్‌సీసీ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, కడప

## నిప్పుల కుంపటి



- సిద్దవటంలో అత్యధికంగా 44.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- మరో 3 రోజులు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు ఎక్కువ నమోదయ్యే అవకాశం

కడప అగ్రికల్చర్: జిల్లా వ్యాప్తంగా బుధవారం ఎండలు అదరగొట్టాయి. జిల్లాలోని సిద్దవటంలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో జనాలు ఎండలకు అదిరిపోయారు. మరో 3 రోజులపాటు సాధారణ ఉష్ణోగ్రతల కంటే 2 నుంచి 4 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త స్వామి చైతన్య తెలిపారు. అలాగే కమలాపురంలోని చిన్నచెప్పలిలో 43.8 డిగ్రీలు, అట్లూరులో 43.5, బద్వేలులో 43.5, ప్రొద్దుటూరు మండలం చౌడూరులో 43.2, సింహాద్రిపురంలో 43.1, ముద్దనూరు మండలం ఉప్పలూరులో 43, వేంపల్లిలో 43, వల్లూరులో 40 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ తీవ్ర ఎండలకు ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ఆరుబయట తిరగకుండా ఉదయం 11 గంటలకే ఇళ్లకు చేరుకోవాలని వాతావరణ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

**జిల్లాలో మూడు రోజులు తేలికపాటి వర్షాలు**

వైఎస్సార్ జిల్లాలో 21, 22, 23 తేదీలలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేక రెండు చోట్ల కురిసే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు.

## రీ సర్వే, భూ సేకరణ పనులు త్వరగా పూర్తి కావాలి

**కలెక్టర్ విజయరామరాజు**



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో రీ సర్వే, భూ సేకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ విజయరామరాజు గురువారం అధికారులను ఆదేశించారు. రీ సర్వే, జాతీయ రహదారుల భూసేకరణ, హౌసింగ్, రెవెన్యూ, వ్యవసాయ అనుబంధ రంగాలు తదితర అంశాలపై కలెక్టర్లు, జేసీలతో చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో ఈ అంశాలపై సమీక్షించారు. చీఫ్ సెక్రటరీ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు సంతృప్త స్థాయిలో అందించాలన్నారు. జిల్లాలో రీ సర్వే సక్రమంగా పూర్తి చేయాలన్నారు. జాప్యం లేకుండా సర్వే రాళ్లు పాతాలన్నారు. భూ రికార్డుల స్వచ్ఛీకరణ వేగవంతం చేయాలన్నారు. జాతీయ రహదారుల అభివృద్ధి, విస్తరణ కోసం చేపడుతున్న భూ సేకరణ, పరిహారం పెండింగ్ లేకుండా చూడాలన్నారు. వేసవి దృష్ట్యా తాగు నీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్‌లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ గణేష్‌కుమార్‌తోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భద్రకాళీ సమేతుడికి అమావాస్య పూజలు

రాయచోటిటౌన్ : రాయచోటి భద్రకాళీ సమేత వీరభద్రస్వామికి అమావాస్య పూజలు నిర్వహించారు. గురువారం మూల విరాట్‌లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను మాఢవీధులలో ఊరేగించారు. ఈ కార్యక్రమం ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలం రెడ్డి విజయ, ఆలయ ఈఓ రమణారెడ్డి, పాలక మండలి సభ్యులు నాగభూషణం, సురేష్ కుమార్, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో జరిగింది.



పల్లకీలో ఊరేగుతున్న భద్రకాళీ సమేతుడు

## వైవీయూలో లా పరీక్షల తనిఖీ



సెమిస్టర్ పరీక్షలను తనిఖీ చేస్తున్న వీసీ ఆచార్య జింక రంగజనార్దన్, సీఈ ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో జరుగుతున్న న్యాయశాస్త్ర సెమిస్టర్ పరీక్షలను వైస్ చాన్సలర్ ఆచార్య జింక రంగజనార్దన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డితో కలిసి వీసీ ఏపీజే అబ్దుల్‌కలాం గ్రంథాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షల ఏర్పాట్లు, సౌకర్యాలపై సహాయ సూపరింటెండెంట్ డాక్టర్ మునికుమారి వీసీకి వివరించారు. 740 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 628 మంది పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. అనంతరం వీసీ చీఫ్ సూపరింటెండెంట్ చాంబర్‌లో ఉన్న సీసీ కెమెరాల్లో పర్యవేక్షణను గమనించారు. పరీక్షల విభాగం చీఫ్ సూపరింటెండెంట్ ఆచార్య టి. శ్రీనివాస్, సహ ఆచార్యులు డాక్టర్ కాత్యాయని, డాక్టర్ విజయ్‌కుమార్‌నాయుడు, పీఆర్ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వి. సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## రిమ్స్‌లో మైక్రోబయాలజీ, ఐసీటీసీ విభాగం ప్రారంభం

కడప అర్బన్: కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో మైక్రోబయాలజీ– ఐసీటీసీ విభాగాన్ని గురువారం ప్రారంభించారు. ఎన్ఎంసీ నిబంధనల మేరకు దీన్ని పునర్నిర్మాణం చేయించారు. కడప రిమ్స్ ప్రిన్సిపాల్, మైక్రోబయాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ ఏ. సురేఖ, సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మైక్రోబయాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయలక్ష్మీ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మహమ్మద్ షాహిద్, డాక్టర్ ఖాజా మొహిద్దీన్, ఏఆర్‌టీ డాక్టర్ గురవయ్య, ఐసీటీసీ కౌన్సెలర్స్ చంద్రయ్య, మారుతీదేవి, ల్యాబ్ టెక్నీషియన్స్, ఎండీ జాకీర్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

**రిమ్స్‌లో ఫార్మకాలజీలో ఏడు పీజీ సీట్లు మంజూరు**

ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల (రిమ్స్)కు 2023–24 వైద్య విద్యా సంవత్సరానికి 7 పీజీ వైద్య విద్య సీట్లు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా గురువారం రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ అవిలేలి సురేఖ ఆధ్వర్యంలో ఫార్మకాలజీ విభాగంలోని అధ్యాపక వైద్యులు, సిబ్బంది కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. పీజీ సీట్ల పెంపునకు సహకరించిన అందరికీ ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీబాయి, ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ పి.రాజేష్, ఫోరెన్సిక్ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాస నాయక్, డీడీ డాక్టర్ శంకర్‌రెడ్డి, ఫార్మకాలజీ విభాగం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.




మైక్రోబయాలజీ పునర్నిర్మాణ విభాగాన్ని ప్రారంభిస్తున్న కడప రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ

## రేపు శ్రీహరికోటకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

మదనపల్లె సిటీ: శ్రీహరికోట శాటిలైట్ లాంచింగ్ వీక్షించేందుకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ–2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. 22న శాటిలైట్ లాంచింగ్ ఉన్నట్లు పేర్కొన్నారు. దీంతో అంకాలమ్మ దేవాలయం, పులికాట్ సరస్సు, నేలపట్టులను సందర్శించవచ్చన్నారు. పాఠశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9959225677 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

## కదులుతున్న డొంక!

- స్టాఫ్ నర్సు పోస్టుల అక్రమాల వెనుక ఓ ఉద్యోగి ప్రమేయం?
- గూడూరు కేంద్రంగా నకిలీ సర్టిఫికెట్ల తయారీ
- ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.10 లక్షలకు పైగా వసూలు
- వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయంలో అలజడి





కడపలోని వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం

కడప రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖ విభాగాల్లో పెద్ద ఎత్తున ఉద్యోగ నియామకాలకు శ్రీకారం చుట్టింది. తద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోంది. ఆ మేరకు ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా 957 కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల నియామకాలకు నోటిఫికేషన్ జారీ చేసింది. అందులో వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం (జోన్–4) రాయలసీమ జిల్లాల పరిధిలో 292 కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల నియామకాలకు పచ్చజెండా ఊపింది. ఈ శాఖ పరిధిలో జనవరిలో జరిగిన నియామకాలు పెద్ద దుమారం లేపాయి.

**బోగస్ సర్టిఫికెట్లతో అక్రమాలు**

ఈ నియామకాలకు సంబంధించి మొత్తం 11 వేల దరఖాస్తులు వచ్చాయి. అందులో మెరిట్, రోస్టర్ ప్రకారం ఉద్యోగ నియామకాలను చేపట్టాలి. ఆ ప్రకారం చేపట్టిన నియామకాల్లో 16 మంది నకిలీ సర్టిఫికెట్లు పొందినట్లుగా ఫిర్యాదులు వచ్చాయి. 16 మందిలో 15 మందికి ఉద్యోగాలు లభించాయి. మరొకరి పేరు జాబితాలో ఉన్నప్పటికీ మెరిట్ లేనందున ఉద్యోగం రాలేదు, మొత్తం 16 సర్టిఫికెట్లు నకిలీవని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వారు నిర్ధారించారు. దీంతో శాఖాపరమైన చర్యల్లో భాగంగా వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే ఎందుకో మరి ఇంకా అసలు సూత్రధారులు బయట పడలేదు. ఇంతవరకు జరిగిన అక్రమాల పరంపర ఇదీ!

**అసలు సూత్రధారి అతడే..**

ఈ నేపథ్యంలో కడపలోని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయానికి ఒకరు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ప్రస్తుతం ఆ శాఖలో పెద్ద దుమారం రేపుతోంది. ఆ ఫిర్యాదు మేరకు వైఎస్సార్ జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న చిత్తూరు జిల్లాకు చెందిన వ్యక్తి ఈ అక్రమాలకు సూత్రధారి అని తెలిసింది. ఈ నకిలీ మార్కుల సర్టిఫికెట్లను నెల్లూరు జిల్లా గూడూరులో తయారు చేస్తున్నారు. ఇందుకు ఒక్కొక్కరి నుంచి రూ. 10 లక్షల వరకు వసూలు చేశారు. ఇంతవరకు బయటపడిన 16 బోగస్ సర్టిఫికెట్లే కాకుండా మరో 60 మంది వద్ద బోగస్ సర్టిఫికెట్లు ఉన్నాయి. ఇంకొంతమంది అంత డబ్బులు ఇచ్చుకోలేక వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది.

**మెరిట్ ఉంటేనే ఉద్యోగం..**

స్టాఫ్ నర్సు నియామకాల్లో మెరిట్, రోస్టర్‌ను ప్రామాణికంగా తీసుకుంటారు. నకిలీ మార్కుల జాబితా కనుక మార్కులు ఎక్కువగానే ఉంటాయి. తద్వారా ఎంపిక జాబితాలో మెరిట్‌లో ముందు వరుసలో ఉంటారు. దీంతో సహజంగానే వారికి ఉద్యోగం లభిస్తుంది. ఇలా అక్రమాలకు తెర లేపారు. ఈ అక్రమాలకు పాల్పడిన వ్యక్తిపై గతంలో కూడా పలు ఆరోపణలు ఉన్నాయి. చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో 2019, 2020, 2021 సంవత్సరంలో జరిగిన ఎన్‌హెచ్‌ఎం స్టాఫ్ నర్సు ఉద్యోగాలు, అలాగే కోవిడ్‌లో స్టాఫ్ నర్సు ఉద్యోగాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాంట్రాక్టు ఉద్యోగ నియామకాల్లో బోగస్ సర్టిఫికెట్లు పెట్టి వందలాది మందికి ఉద్యోగాలు ఇప్పించారు. ఇతర పారా మెడికల్ ఉద్యోగాల్లో కూడా అక్రమాలకు పాల్పడ్డారు. తద్వారా లక్షలాది రూపాయలు దోచుకున్నారు. ఇందుకు సంబంధించి చిత్తూరు టుటౌన్ పోలీసు స్టేషన్‌లో కూడా కేసు నమోదైంది. అలాగే ఇంకొన్ని విషయాలకు సంబంధించి కూడా అతనిపై కేసులు ఉన్నాయి.

**లోతుగా విచారణ చేపడితేనే...**

ఆ వ్యక్తిపై గతం నుంచే పలు ఆరోపణలు ఉన్నాయి. అయితే కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల నియామకాల్లో పెద్ద సంఖ్యలో బోగస్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన వారు, అదీ వారంతా చిత్తూరు జిల్లాకు చెందిన వారే కావడంతో అతని పాత్ర ఉందనే ఆరోపణలు వచ్చాయి. ప్రస్తుతం అక్రమాల ఆరోపణలను ఎదుర్కొంటున్న ఆ వ్యక్తి వైఎస్సార్ జిల్లా పరిధిలో పనిచేస్తున్నారు. ఈ అంశంపై ఉన్నతాధికారులు లోతుగా దర్యాప్తు చేస్తే, ఈ కుంభకోణం వెనుక ఇంకా ఎంత మంది సూత్రధారులు ఉన్నారనే విషయం వెలుగు చూస్తుంది. ఈ అంశంపై ఆ శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ కోటేశ్వరిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె వ్యక్తిగత సెలవులో ఉన్నారు.

## విద్యుత్ సమస్యలను త్వరగా పరిష్కరించాలి



'డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ' కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఈ మునిశంకరయ్య

కడప కార్పొరేషన్: విద్యుత్ సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఏపీఎస్‌పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్.ముని శంకరయ్య అన్నారు. గురువారం స్థానిక విద్యుత్ భవన్‌లోని తన ఛాంబర్‌లో 'డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ' కార్యక్రమంలో భాగంగా ఫోన్ ద్వారా వినియోగదారుల నుంచి సమస్యలు స్వీకరించారు. ఈ సందర్భంగా కడప, ఖాజీపేట, కమలాపురం, కొండాపురం, ముద్దనూరు, బద్వేల్, సిద్దవటం, పోరుమామిళ్ల, సీకేదిన్నె మండలాల నుంచి 16 మంది ఫోన్ చేసి తమ సమస్యలను తెలిపారు. వీటిని పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎస్ఈ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఈలు పి. సుబ్రమణ్యం, జీవీ సుబ్బారావు, జేఈ లావణ్య పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### సక్రమంగా పని చేయని రవాణా శాఖ సర్వర్‌

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : నగర శివార్లలోని ఊటుకూరు సమీపంలో జిల్లా ఉప రవాణా శాఖ కార్యాలయంలో రవాణా శాఖ సర్వర్‌ మొరాయించింది. ఆన్‌లైన్‌ సర్వర్‌ సక్రమంగా పని చేయకపోవడంతో ఎల్‌ఎల్‌ఆర్‌, డ్రైవింగ్‌ టెస్ట్‌కు వచ్చే వాహనాదారులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. రవాణా శాఖ కార్యాలయంలో కాలం చెల్లిన కంప్యూటర్లు ఉండటం, ఇంటర్‌నెట్‌ సైతం సరిగా పని చేయకపోవడంతో వాహనాదారులు పడిగాపులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### మద్యం మత్తులో యువకుడు ఆత్మహత్య

చెన్నూరు : చెన్నూరు మండలం కొక్కరాయపల్లె గ్రామానికి చెందిన పాలూరు శ్రీనివాసులు (36) కుటుంబ కలహాలు, ఒంటరితనం భరించలేక తన ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ శ్రీనివాసులురెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మృతుడు శ్రీనివాసులు మొదటి భార్యకు విడాకులు ఇచ్చి తన అక్క కుమార్తెను వివాహం చేసుకున్నాడు. అయితే రెండో భార్య మతిస్థిమితం సరిగా లేకపోవడం, మరోవైపు ఒంటరితనం వెరసి శ్రీనివాసులు మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### గుర్తు తెలియని వృద్ధుడు మృతి



మైదుకూరు : మైదుకూరు ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం సాయంత్రం గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. సుమారు 60 ఏళ్ల వయసున్న ఆ వ్యక్తి తెల్లని చుక్కలున్న లుంగీ ధరించి ఉన్నాడు. మృతదేహం వద్ద ఎర్రని చారల టవాల్‌ కూడా ఉంది. అతని చొక్కా జేబులో వివరాలను తెలిపే ఎలాంటి ఆధారాలు లేవని మైదుకూరు అర్బన్‌ పోలీసులు తెలిపారు. అనారోగ్యంతో కానీ, వడ దెబ్బ వల్ల కానీ మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. ఎవరైనా ఈ వృద్ధుడిని గుర్తిస్తే తమకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

# కరుణ చూపే ఘడియకోసం ఎదురుచూపు

**నేడు రంజాన్‌ మాసం చివరి జుమ్మా**



కడప కల్చరల్‌ : రంజాన్‌ మాసంలోని చివరి శుక్రవారాన్ని అల్‌ విదా జుమ్మా (జుమ్మాతుల్‌ విదా) అంటారు. ముస్లిం ప్రతివారం సాధారణంగా వచ్చే శుక్రవారాన్ని కూడా వారు ఎంతో పవిత్రమైనదిగా గౌరవిస్తారు. ఇక రంజాన్‌ మాసంలో వచ్చే నాలుగు శుక్రవారాలను కూడా గొప్పవిగా భావిస్తారు. మళ్లీ ఏడాదిపాటు ఈ శుక్రవారం కోసం ఎదురుచూడాల్సి ఉంటుంది గనుక అల్లాహ్‌ దయచేసిన ఈ ×జుమ్మా¤ రోజును విశేష ప్రార్థనలతో ఫలప్రదం చేసుకునేందుకు ప్రతి ముస్లిం శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తాడు. ఈ జుమ్మా ప్రార్థనల కోసం మసీదులు సిద్ధమవుతున్నాయి.

**ప్రత్యేక ప్రాధాన్యత**

వారంలో శుక్రవారాన్ని ముస్లింలు దైవ ప్రార్థనకు అత్యంత ఉత్తమమైనదిగా భావిస్తారు. మిగతా ఆరు రోజుల్లో మసీదుల్లో ప్రార్థనలు మాత్రమే నిర్వహిస్తారు. జుమ్మా రోజున ప్రార్థనలతోపాటు మత గురువులు దైవ సందేశం ఇస్తారు. మిగతా రోజుల్లో ఆధ్యాత్మిక సందేశం వినే అవకాశం ఉండదు గనుక జుమ్మా రోజున మాత్రం దైవ సందేశం వినే అవకాశం లభిస్తుందని తప్పక వెళతారు. రంజాన్‌ మాసంలో చివరి శుక్రవారం పవిత్రమైనదిగా భావిస్తారు.మిగతా రోజులతో పోలిస్తే శుక్రవారానికి ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. ముఖ్యంగా జొహర్‌ నమాజ్‌ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తారు. చిన్న పిల్లలు మొదలుకొని వృద్ధుల వరకు స్నానాలు ఆచరించి ఉన్నంత శుభ్రంగా, సంప్రదాయంగా ఉండే దుస్తులు ధరించి ప్రార్థనల్లో నిమగ్నమవుతారు. మగవారు ఆజాన్‌ అయిన వెంటనే మసీదులకు చేరుకుంటారు. ఎంత ముఖ్యమైన కార్యక్రమమైనా పుణ్యదాయకమని భావించినా నమాజ్‌ అనంతరమే వాటిని ఆచరిస్తారు. నమాజ్‌ సమయంలో ఏ ఇతర కార్యక్రమాలు పెట్టుకోకుండా ప్రార్థనల్లో నిమగ్నమవుతారు. ప్రార్థనల తర్వాత పేదలకు దానధర్మాలు చేస్తారు. సాయంత్రం ఇఫ్తార్‌ విందులో పాల్గొంటారు. జుమ్మా రోజున ప్రత్యేకంగా ఒక ఘడియ ఉంటుందని, ఆ సమయంలో భక్తులు ఏదీ కోరుకున్నా అల్లాహ్‌ తప్పక అనుగ్రహిస్తాడని ముస్లింలు విశ్వసిస్తారు. జుమ్మా నమాజుకు ముందుకు రెండు ఆధ్యాత్మిక ప్రసంగాలు ఉంటాయి. మొదటిదానిలో ఇమామ్‌ దైవ శోస్త్రం, ప్రవక్త గుణగణాలు, ఆయన చేకూర్చే శుభాలను తెలియజేస్తారు. రెండవ భాగంలో ఖురాన్‌లోని పలు భాగాలను వినిపిస్తారు. జుమ్మా రోజున అజాన్‌ అయినప్పటి నుంచి నమాజ్‌ పూర్తయ్యే వరకు ముస్లింలు ప్రాపంచిక విషయాలను మానేసి దైవచింతనతో గడపాలని ఖురాన్‌ పేర్కొంటోంది. శుక్రవారానికి 'ఈదుల్‌ మోమిమీన్‌'అని పేర్కొంటారు. అంటే పండుగ వంటిదని అర్థం. మిగతా రోజులకంటే శుక్రవారం రోజున మసీదులకు అధిక సంఖ్యలో భక్తులు హాజరవుతారు. మిగతా రోజుల్లో వీలుగాకపోయినా శుక్రవారం రోజా విరమణ సందర్భంగా ముస్లింలు ఇతరులకు తమ చేతనైనా కొద్దీ ఫలహారం అందించి పుణ్యఫలాలు పొందుతారు.

# అగ్నిమాపక సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న డిటీసీ ఈ. మీరా ప్రసాద్‌

కడప అర్బన్‌ : జిల్లావ్యాప్తంగా అగ్నిమాపక సిబ్బంది సేవలు అభినందనీయమని జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్‌ కమీషనర్‌ ఈ. మీరా ప్రసాద్‌ అన్నారు. గురువారం కడపలో అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డిటీసీ ఈ. మీరా ప్రసాద్‌ మాట్లాడుతూ అగ్నిప్రమాదాలే కాకుండా రోడ్డు ప్రమాదాలు, వరదలు వచ్చినపుడు రక్షణ, సహాయక చర్యల్లో సిబ్బంది సమర్థవంతంగా పని చేస్తున్నారన్నారు. ప్రజలందరూ అగ్నిప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు. కడప తహశీల్దార్‌ శివరామిరెడ్డి మాట్లాడుతూ అగ్నిమాపక సిబ్బంది బుగ్గవంక వరదలప్పుడు చేసిన సేవలను గుర్తు చేస్తూ అభినందించారు. జిల్లా అగ్నిమాపక అధికారి బి.వి.ఎస్‌ రామ్‌ ప్రకాష్‌, కడప అగ్నిమాపక కేంద్రం, సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి పి. బసివిరెడ్డి మాట్లాడారు. ఇండస్ట్రీల్లో, ఎల్‌పిజీ అగ్నిప్రమాదాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను, నివారణ పద్ధతులను డెమోల ద్వారా వారు వివరించారు.

# బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు



నిందితుడు బండారు చంద్రమోహన్‌రావు

కడప అర్బన్‌ : కడప రిమ్స్‌ పీఎస్‌ పరిధిలో 13 ఏళ్ల బాలికపట్ల అసభ్యంగా ప్రవర్తించిన కేసులో నేరం నిర్ధారణ కావడంతో నిందితుడు బండారు చంద్రమోహన్‌రావు (38)కి మూడేళ్ల జైలు శిక్ష, రూ. 5వేలు జరిమాన విధిస్తూ పోక్సో ప్రత్యేక కోర్టు ఇన్‌చార్జి జడ్జి, ఫస్ట్‌ ఏడిజే కోర్టు జడ్జి సీ.ఎన్‌. మూర్తి గురువారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించకుంటే అదనంగా మూడు నెలల శిక్ష అనుభవించాలని జడ్జి తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసు వివరాలిలా వున్నాయి. ప్రకాశం జిల్లా వేటపాలెంకు చెందిన బండారు చంద్రమోహన్‌రావు రిమ్స్‌ పీఎస్‌ పరిధిలో తైక్వాండో కోచ్‌గా ఓ స్కూల్‌లో పనిచేసేవాడు. 2019 మార్చి 21న స్కూల్‌కు చెందిన మైనర్‌ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు బాలిక ఫిర్యాదు మేరకు అప్పటి రిమ్స్‌ పి.ఎస్‌. ఎస్‌ఐ ఏ. విద్యాసాగర్‌ 354 ఐపీసీ సెక్షన్‌ 12 ఆఫ్‌ పోక్సోయాక్ట్‌ -2012 మేరకు క్రైం నెం. 17/2019గా కేసు నమోదు చేశారు. ఈ కేసులో సాక్ష్యాధారాలను విచారించిన తరువాత గురువారం నిందితుడికి శిక్ష ఖరారు చేస్తూ జడ్జి తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్‌ తరపున పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ ఎస్‌. రామ సుబ్బారెడ్డి వాదించారు. సాక్ష్యాధారాలతో నేర నిరూపణ చేసిన ప్రస్తుత రిమ్స్‌ పిఎస్‌ సీఐ కె. రామచంద్ర, కోర్టు మానిటరింగ్‌ సెల్‌ ఇన్స్‌పెక్టర్‌ మధుసూదన్‌రావు, అప్పటి రిమ్స్‌ ఎస్‌ఐ విద్యాసాగర్‌, సిబ్బందిని జిల్లా ఎస్పీ కేకేఎన్‌ అన్బురాజన్‌ అభినందించారు.

# జిల్లా హాకీ జట్టు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టు

కడప స్పోర్ట్స్‌ : సత్యసాయి జిల్లా ధర్మవరంలో ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో పాల్గొనే వైఎస్‌ఆర్‌ కడప జిల్లా సీనియర్‌ హాకీ జట్టును ప్రకటించారు. ఇటీవల జరిగిన ఎంపికల్లో ప్రాబబుల్స్‌ను ఎంపిక చేయగా, క్యాంపు అనంతరం రాష్ట్రస్థా పోటీల్లో పాల్గొనే తుది జట్టును ఎంపిక చేసినట్లు హాకీ కడప జిల్లా అధ్యక్షుడు ఎ. శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌ ఆకుల రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

**జిల్లా జట్టు :** యాసీన్‌, బాలాజీ, స్వప్నీరెడ్డి, దినకర్‌, వి. దీపు, వెంకటరమణ, శివనాగరాజు, ఇస్మాయిల్‌, శ్రీనివాసులు, సొహైల్‌, సుబ్బరాఉడు, అమీర్‌, శివ, సందీప్‌, ప్రశాంత్‌, ఇర్ఫాన్‌, వెంకటేశ్వర్లు, హేమంత్‌, కోచ్‌ : రమేష్‌బాబు, మేనేజర్‌ : సందీప్‌రాజు.

### రోడ్డుప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

రామాపురం : మండల పరిధిలోని బండపల్లె సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజగోపాల్‌రెడ్డి (50) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు కడప నుండి రాయచోటి వైపు వెళ్తున్న కేఏ 53 ఏఏ 4748గల టాటా ఏస్‌ వాహనం బండపల్లె సమీపంలో ఎదురుగా వస్తున్న ఏపీ39 జీఎక్స్‌ 7112 ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. రాజగోపాల్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు రాజగోపాల్‌రెడ్డి వైఎస్సార్‌ జిల్లా ఖాజీపేట మండలం తురుమల దిన్నెకు చెందినవాడిగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ఆసుపత్రికి తరలించారు. మృతుడి బంధువులకు సమాచారం అందించారు.

### కుక్కల దాడిలో గొర్రెలు మృతి



ములకలచెరువు : కుక్కల దాడిలో ఎనిమిది గొర్రెలు మృతిచెందిన సంఘటన గురువారం సాయంత్రం మండలంలో చోటుచేసుకుంది. బాధితుడు మల్లికార్జునరెడ్డి కథనం మేరకు... మండలంలోని పర్తికోట పంచాయతీ మామిడిగుంపులవారిపల్లెకు చెందిన మల్లికార్జునరెడ్డి గొర్రెలు మేపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ప్రతి రోజూ దగ్గరలోని అడవిలోకి గొర్రెలు మేత కోసం తోలుకొని వెళ్లి వచ్చేవాడు. ఈ క్రమంలో సాయంత్రం గొర్రెలు తోలుకొని ఇంటికి వచ్చే సమయంలో గొర్రెల మందపై వీధి కుక్కలు దాడికి దిగాయి. మూడు గొర్రె పిల్లలు, ఐదు గొర్రెలను చంపేశాయి. సుమారుగా రూ.60 వేలు నష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు.

### అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లిన బస్సు

– ఇద్దరికి గాయాలు



పంట పొలాల్లోకి దూసుకెళ్లిన బస్సు

దువ్వూరు : మండల పరిధిలోని గుడిపాడు గ్రామం వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌ నుంచి తిరుపతికి వెళుతున్న ఓ ప్రైవేటు బస్సు గుడిపాడు గ్రామం వద్దకు రాగా అతి వేగంగా ప్రయాణిస్తున్న బస్సు అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. బస్సులో 18 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు తీవ్రంగా, 16 మందికి స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాఘవేంద్రారెడ్డి తెలిపారు.

# కాశీనాథుని దర్శనం లేకనే...

**స్వగ్రామానికి వెనుదిరిగిన యాత్రికులు**

బి.కొత్తకోట : కాశీనాథుని దర్శనం..తర్వాత ఇతరా ఆలయాలను దర్శించుకునేందుకు వెళ్లిన యాత్రికులు స్వామి దర్శనం లేకనే బుధవారం అర్ధరాత్రి స్వగ్రామానికి వెనుదిరిగారు. బి.కొత్తకోట మండలం గుంతావారి పల్లెకు చెందిన పి.వెంకటరెడ్డి (69), కే.శేఖర (30), ఎల్‌.సరస్వతి (45), డి.మునిస్వామి (65), జే.శంకరమ్మ (45), జే.పద్మావతమ్మ (60), పి.రఘునాథరెడ్డి (52), ఆర్‌.శాంతమ్మ (65), రామస్వామి (70) బృందం కాశీ, మధుర, ఇతర ఆలయాల దర్శనం కోసం సోమవారం ఉదయం బయలుదేరి బుధవారం ఉదయం మధుర రైల్వేస్టేషన్‌ చేరుకున్న సంగతి తెలిసిందే. వీరిలో పి.వెంకటరెడ్డి మృతి చెందడంతో యాత్ర అర్ధంతరంగా ఆగిపోయింది. మధుర ప్రభుత్వ ఆస్పత్రిలో వెంకటరెడ్డి మృతదేహం తరలింపునకు సంబంధించిన ప్రక్రియ పూర్తవడంతో బుధవారం రాత్రి గుంతావారిపల్లెకు బయలుదేరింది.శుక్రవారం ఉదయం గ్రామానికి చేరుకోనుంది. వాహనంలో యాత్రకు వెళ్లిన వారిలో ముగ్గురు ఉండగా మిగిలిన ఐదుగురు అర్ధరాత్రి రైలులో వెనుదిరిగారు.వెంకటరెడ్డి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



లావణ్య తండ్రి చిన్నయ్య ఆచారికి చెక్కు ఇస్తున్న ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్‌ ఆకేపాటి

రాజంపేట రూరల్‌ : విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌తో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన దివ్యాంగురాలు లావణ్య కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. గురువారం ఆకేపాడులో గల ఆకేపాటి ఎస్టేట్‌లో ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్‌ ఆకేపాటి అమరనాథరెడ్డిలు లావణ్య తండ్రి కాకర్ల చిన్నయ్య ఆచారికి రూ.5లక్షల చెక్‌ను ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులతో కలిసి అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు జగనన్న ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే విషయాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. వారు చొరవ తీసుకొని రూ.5లక్షలు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి సహకారం అందించారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ నాయకులు ఆకేపాటి అనీల్‌కుమార్‌రెడ్డి, ఆకేపాటి మురళీరెడ్డి, ఏబీ మహేశ్వరరెడ్డి, పీ విశ్వనాథరెడ్డి, బీ రామ్మోహన్‌నాయుడు, దండు గోపీ, దాసరి పెంచలయ్య, జీ నాగేశ్వరెడ్డి, ఎం శ్రీనివాసులగౌడ్‌, ఎస్‌ శ్రీనివాసులు, విద్యుత్‌శాఖ డీఈఈ ఎం సురేంద్రనాథ్‌, రూరల్‌ ఏఈ ఎల్‌ ఈశ్వరరాజు పాల్గొన్నారు.



# వైభవం..గ్రామోత్సవం



సింహ వాహనంపై శ్రీ కామాక్షీ వైద్యనాథస్వామి



గజ వాహనంపై ఊరేగుతున్న శ్రీ చెన్నకేశవ స్వామి

వల్లూరు : పుష్పగిరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి సింహ వాహనంపై , శ్రీ చెన్న కేశవ స్వామి గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం శ్రీ వైద్యనాథస్వామి ఆలయంలో అర్చకులు శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. శ్రీ కామాక్షీ అమ్మవారికి, శ్రీ చక్రానికి కుంకుమార్చన చేశారు. రాత్రి మంగళ వాయిద్యాలు, దివిటీల వెలుగుల మధ్య స్వామి వారి గ్రామోత్సవాన్ని పుష్పగిరి మాడ వీధుల్లో నిర్వహించారు. కొండపైన గల శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు అఖిల్‌ దీక్షితులు ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలను, తోమాల సేవ జరిపారు. శ్రీ లక్ష్మీదేవికి అర్చనలు నిర్వహించారు. రాత్రి గజ వాహనం అధిష్టించిన చెన్న కేశవ స్వామి వారిని కొండపై నుంచి పెన్నా నది మీదుగా దివిటీల వెలుగులో గ్రామంలోకి తీసుకొచ్చి పుష్పగిరి గ్రామ మాడ వీధులలో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు కాయ, కర్పూరాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సుమంత్‌ దీక్షితులు, రాజేశ్వర శర్మ , ఉభయ దాతలు పాల్గొన్నారు.

**పుష్పగిరిలో నేడు అష్టోత్తర కళశాభిషేకం**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం పుష్పగిరిలోని శ్రీ వైద్య నాథేశ్వర స్వామి ఆలయంలో ఉదయం రుద్రాభిషేకం, కుంకుమార్చనలు జరుగుతాయి. రాత్రి స్వామివారికి పురుషామృగ వాహన సేవ ఉంటుంది. శ్రీ లక్ష్మీ చెన్న కేశవ ఆలయంలో ఉదయం అష్టోత్తర కళశాభిషేకం జరుగుతుంది. రాత్రి స్వామి వారికి పెద్ద శేష వాహన సేవ వుంటుంది.

# 'మిషన్‌ వాత్సల్య'తో ఆర్థిక భరోసా



మిషన్‌ వాత్సల్య పథకానికి దరఖాస్తు చేసేందుకు వచ్చిన వారు

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : అనాథలు, అభాగ్యులుగా మారిన 6 నుంచి 18 సంవత్సరాలలోపు పిల్లలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న మిషన్‌ వాత్సల్య పథకం భరోసాగా నిలుస్తోంది. ఈ పథకం కింద ఒక్కొక్కరికి నెలకు రూ. 4 వేలు చొప్పున ఏడాదిపాటు ఆర్థికసాయం అందిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం రూ. 1400, కేంద్ర ప్రభుత్వం రూ. 2600 చొప్పున అందిస్తోంది. ఓవైపు ఉచితంగా చదువును అందిస్తూ మరోవైపు ఆర్థికసాయం ద్వారా అభాగ్యులైన బాలలకు ప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయి.గతేడాది ఏప్రిల్‌ నుంచి ఈ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చారు.

**లబ్ధిదారులు ఎవరంటే?**

- తల్లిదండ్రులను కోల్పోయిన లేక తల్లిదండ్రులు దూరమైన పిల్లలు
- పాక్షిక అనాథలైన (తల్లి లేక తండ్రిని కోల్పోయిన, విడాకులు పొందిన) పిల్లలు, కుటుంబాలను వదిలివేసిన తల్లిదండ్రులు, ప్రాణాంతకమైన వ్యాధి బారిన పడిన వారి పిల్లలు.
- పేదరికంతో ఇంటి పెద్దను కోల్పోయిన పిల్లలు
- బాలల న్యాయ ఆదరణ సంరక్షణ చట్టం -2015 ప్రకారం ఇల్లులేని పిల్లలు
- ప్రకృతి వైపరీత్యానికి గురైన బాలలు, బాల కార్మికులు
- అక్రమ రవాణాకు గురైన బాలలు, బాల యాచకులు
- బాల్య వివాహ బాధితులు, హెచ్‌ఐవీ బాధిత, దివ్యాంగుల పిల్లలు

**ఇప్పటివరకు 6510 దరఖాస్తులు**



మిషన్‌ వాత్సల్య పథకానికి వైఎస్సార్‌ జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 6510 దరఖాస్తులు వచ్చాయి. మండల స్క్రూటినీ కమిటీ పరిశీలన అనంతరం అర్హులను ఎంపిక చేస్తాం. అలాగే గతేడాది 614 మందిని రెన్యూవల్‌ చేస్తున్నాం. ఏడాదిపాటు లబ్ధిదారులకు నెలకు ఒక్కొక్కరికి రూ. 4 వేలు చొప్పున అందజేయనున్నాం.

– ఎంఎన్‌ రాణి, పీడీ, మహిళా శిశు సంక్షేమశాఖ, కడప

**గతేడాది రూ. 1.71 కోట్లు అందజేత**

మిషన్‌ వాత్సల్య పథకం ద్వారా గతేడాది జిల్లాలో 614 మంది పిల్లలకు నెలకు ఒక్కొక్కరికి రూ. 4 వేల చొప్పున రూ. 1,71,92,000 అందించారు. ఈ ఏడాది 6510 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులను మండలస్థాయి స్క్రూటినీ కమిటీ సభ్యులు, తహసీల్దార్‌, ఎంపీడీఓ లేదా మున్సిపల్‌ కమిషనర్‌, ఎంఈఓ, సీడీపీఓలు, సూపర్‌వైజర్‌ పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. ఎంపికైన వారికి రూ. 4 వేలు చొప్పున 12 నెలలపాటు ఆర్థికసాయం అందిస్తారు. గతేడాది లబ్ధిదారులను రెన్యూవల్‌ చేయడంతోపాటు కొత్త వారికి కూడా ఆర్థికసాయం అందించనున్నారు. ఇంకా ఎవరైనా దరఖాస్తు చేసుకోదలిచిన వారు సంబంధిత సచివాలయంలోని మహిళా పోలీసు ద్వారా సీడీపీఓకు అందజేయాల్సి ఉంటుంది.

**మిషన్‌ వాత్సల్య పథకానికి వచ్చిన దరఖాస్తులు**

| మండలం | దరఖాస్తులు |
|---|---|
| బద్వేలు | 246 |
| చాపాడు | 326 |
| సీకే దిన్నె | 702 |
| జమ్మలమడుగు | 319 |
| కడప | 852 |
| కమలాపురం | 1031 |
| ముద్దనూరు | 464 |
| మైదుకూరు | 522 |
| పోరుమామిళ్ల | 380 |
| ప్రొద్దుటూరు రూరల్‌ | 312 |
| ప్రొద్దుటూరు అర్బన్‌ | 217 |
| పులివెందుల | 840 |
| వేంపల్లె | 299 |
| మొత్తం | 6510 |